# 14. ఆనయ నాయనారు

తమిళనాడులో తిరుచినాపల్లి జిల్లాలో ప్రముఖ తీర్థయాత్రా స్థలములలో తిరుమంగళము ఒకటి. ఇక్కడుండే దైవము సామవేదేశ్వరుడు. ఈ దైవమే పరశురాముని మాతృ హత్యాపాతకము నుండి విముక్తి కలిగించినది. పరశువును గూడ ఇచ్చి భార్గవరాముని పరశురామునిగ జేసినది.

ఈ మహిమాన్వితమైన గ్రామములో ఆనయారు అనబడే పశుల కాపరి వుండేవాడు. గోసంరక్షకుడుగా నున్నందున ఆయన కాపేరు వచ్చింది. ఆయన శివభక్తాగ్రేశ్వరుడు. ఎల్లపుడు విభూతిని ధరించేవాడు. శివభక్తులలో కులము, మతము మున్నగునవేవీగమనించక వారిని బహుప్రీతిగా అర్చించేవాడు. వేణుగానంలో పంచాక్షరి మంత్రముమిళితం చేసి పరమశివుని మీద భక్తిని చూపేవాడు. ఈ మంత్రధ్యానంలోనే శివుని పొందాలనుకున్నాడు.

ఒక రోజున శివునికి పరమ ప్రీతికరమయిన కోన్రాయి వృక్షము క్రింద కూర్చొని పరవశముతో పంచాక్షరిని వేణువు మీద పాడుతున్నాడు. ఆ సంగీతము ఆ ప్రదేశమంతా వీనులవిందుగా సాగింది. ఆవులు దూడలు చెవులు నిక్కరించుకొని వినడానికి మూగాయి. చెట్లమీద పక్షులు ఆ నాదంలో మునిగిపోయి ఎక్కడివి అక్కడే వుండి పోయాయి. నెమళ్లు పురివిప్పి గమకంగా నృత్యము చేశాయి. జంతుతతి అలానే తన్మయత్వంతో నిలబడిపోయాయి. లేళ్లు, సర్పతతి, సింహాలు, ఏనుగులు, శార్దూలాలు పంచాక్షరి మంత్రముగ్ధులై ఆ వేణుగానాన్ని ఆలకిస్తూ నిలిచాయి. నదీ ప్రవాహములు గూడ స్థబ్ధులయ్యాయి. సముద్ర తరంగాలు గూడ మురిసిపోతున్నట్లు కనిపించాయి. విద్యాధరులు, కిన్నెరలు, దేవతలు దివినుండి వారి వాహనాలపై భువికి దిగి చుట్టు మూగారు.

సమస్త ప్రకృతిని తన్మయత్వంలో ముంచిన ఆనయారు భక్త్యభి నివేశమునకు పరమశివుడు ఆనందాబ్ధిలో ఓలలాడాడు. భక్తికి కరిగిపోయాడు. వేణువుపై పంచాక్షరి గానము అమృతమై చిలికింది.

పార్వతీ పరమేశ్వరులు ప్రత్యక్షమయి నాయనారును ఆశీర్వదించి తమ నివాసము కైలాసమునకు ఆదరముతో నాయనారును తీసికొని వెళ్లారు.